మాయ గురించి తెలిసినట్లుగా చెప్పకూడదు. ఈ పిచ్చి పిచ్చి ఉపన్యాసాలు కట్టిపెట్టి ముందు నిన్ను నువ్వు ఉద్ధరించుకో చాలు." మృదువుగా కోప్పడ్డాడు జ్ఞాని.

## 42. జ్ఞానం-భక్తి

"స్వామీ! సంపూర్ణ భక్తి వల్ల మోక్షం రాదటగా? అందుకు జ్ఞానం తప్పనిసరి అని, జ్ఞాన మార్గమే మంచి మార్గమని అంటున్నారు. నేను నా మార్గాన్ని మార్చుకోవాలా?" ఓ శిష్యుడు తన గురువుని ప్రశ్నించాడు.

"నీ ప్రశ్నకి సమాధానం 'అవును, కాదు' కూడా. ఎలాగంటే, రామారావు అనే ఓ వ్యక్తి వైద్యుడు. రామారావులో వైద్యుడు వున్నాడు కాని, వైద్యుడులో రామారావు లేడు. రామారావు వైద్యుడు కానప్పుడు కూడా వున్నాడు కాని, రామారావు కాని వైద్యుడు ఎన్నడూ లేడు. నే చెప్పింది ఇంతదాకా అర్ధమైందా?" ప్రశ్నించాడు గురువు.

"అర్ధమైంది స్వామీ. వైద్యం అనే జ్ఞానం రామారావులో ప్రవేశించేదాకా రామారావు వుత్త రామారావే, తర్వాతే అతను వైద్యుడయ్యాడు."

"కదా? అలాగే నువ్వు ఆ పరమాత్మవే. కాని నీలో ఆ జ్ఞానం ఇంకా కలగలేదు. అది కలిగితే నువ్వు పరమాత్ముడివి అవుతావు."

"వైద్య జ్ఞానం రాకమునుపు రామారావు కూడా ఎలా డాక్టర్‌గా లేడో, అలాగే నేను ఆ పరమాత్ముడినన్న జ్ఞానం నాకు కలగనంత కాలం నేను జీవుడినే అన్నమాట."

"అవును. అయితే పట్టుదలగా వైద్య విద్యని చదివి రామారావు ఎలా వైద్య విజ్ఞానాన్ని సంపాదించుకున్నాడో, అలాగే జీవులు కూడా భక్తి అనే పరిశ్రమ ద్వారా జ్ఞానాన్ని ఆర్జిస్తారు. దైవభక్తి లేకుండా ఆ జ్ఞానం ఎన్నటికీ రాదు."

"అర్ధమైంది స్వామీ."

"నిజానికి ఈ పోలిక కూడా సరైంది కాదు. ఇక్కడ రామారావు వేరు. వైద్య జ్ఞానం వేరు. రామారావు తనకి లేని జ్ఞానాన్ని బయట నించి నేర్చుకున్నాడు.

కాని నువ్వు పరమాత్మవే అనే జ్ఞానం నీలోనే వుంది తప్ప నీకు వేరుగా లేదు. అది నీ అనుభవంలోకి రావడం లేదంతే. దాన్ని నీ అనుభవంలోకి తెచ్చే సాధనాల్లో ఒకటి దైవ భక్తి. అంతేకాక వైద్య జ్ఞానం రావడానికి రామారావుకి రోజుకి కొంత చొప్పున మొత్తం చదవడానికి అయిదు సంవత్సరాలు పట్టింది. నువ్వు పరమాత్మవి అన్న జ్ఞానం ఇలా మెల్లి మెల్లిగా రాదు. ఒక్క చిటికె వేసినంత కాలం కూడా అందుకు పట్టదు. ఆ క్షణం రావడానికే భక్తి, ధ్యానం, వైరాగ్యం మొదలైనవి వుపయోగిస్తాయి."

ఆ వివరణతో శిష్యుడి అనుమానం తీరింది.

## 43. అక్షర లక్షలు

ఓ బ్రాహ్మణుడు ఓ రాజు దగ్గరకి తన కూతురి వివాహానికి తగిన ఆర్థిక సహాయం కోరి వచ్చాడు. రాజు ఆయనకి ఓ భగవద్గీతని ఇచ్చి చెప్పాడు.

"రేపు గీతా జయంతి. రేపు మీరు దీన్లోని పద్దెనిమిది అధ్యాయాలనీ బాగా అధ్యయనం చేసి ఎల్లుండి వచ్చి డబ్బు తీసుకు వెళ్ళండి."

ఆ బ్రాహ్మణుడు 'సరే' అని దాన్ని తీసుకుని వెళ్ళాడు. వారం అయినా ఆ బ్రాహ్మణుడు తిరిగి రాజు దగ్గరకి రాకపోవడంతో ఓ రోజు రాజు వార్తాహరుడ్ని పంపి ఆ బ్రాహ్మణుడ్ని పిలిపించి అడిగాడు.

"డబ్బు కోసం మీరు మళ్ళీ రాలేదే?"

"రాజా! మీరిచ్చిన గీతని క్షుణ్ణంగా అధ్యయనం చేసాను. అందులోని ఓ శ్లోకం చదివాక ఇక ధన సహాయం కోసం మీ దగ్గరకి రావాలనిపించక రాలేదు."

"తొమ్మిదో అధ్యాయంలోని ఇరవై రెండో శ్లోకం గురించి కాదుగా మీరు చెప్పేది?" నవ్వుతూ ప్రశ్నించాడు రాజు.

"అక్షర లక్షల కన్నా ఎక్కువ విలువ చేసే ఆ శ్లోకం సరిగ్గా అదే మహారాజా. *'అనన్యాశ్చింతయంతో మాం'* శ్లోకం ద్వారా ఆ పరమాత్ముడు ఎవరైతే తనని తీవ్రభక్తితో కొలుస్తారో వారి యోగక్షేమాలని తనే చూసుకుంటానని హామీ